క్లుప్తంగా

ఆరోగ్య జాగ్రత్తలపై ప్రచారం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి శైలజ

కె.కోటపాడు: అంటురోగాల సీజన్ కావడంతో గ్రామాల్లో ప్రజలకు వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు ఆరోగ్య జాగ్రత్తలను వివరించాలని తెలిపారు. లంకవానిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం వైద్య సిబ్బందితో ఆమె జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పరిశుభ్రతకు ప్రజలు ప్రాధాన్యం ఇవ్వాలని ఆమె కోరారు. ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వ లు లేకుండా చూడడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. తద్వారా మలేరియా, డెంగ్యూ జ్వరాల బారిన పడకుండా ఉండవచ్చునని తెలిపారు. ప్రస్తుత సీజన్‌లో వేడిచేసి చల్లార్చిన నీటిని తీసుకోవడంతో పాటు ఆహార పదార్థాలపై మూతలను ఉంచుకోవాలని ప్రజలకు వివరించాలని వైద్య సిబ్బందికి ఆమె సూచనలను చేశారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్.ప్రమీల, హెల్త్ సూపర్‌వైజర్ సన్యాసిరావు, హెల్త్ అసిస్టెంట్ త్రినాథ్ పాల్గొన్నారు.

సంతోషిమాత అమ్మవారి దీక్షలు విరమణ

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో గల సంతోషిమాత అమ్మవారి మాలాధారణ భక్తులు శనివారం మాలాధారణ దీక్షలు విరమించారు. ఈ నెల 16 వ తేదీన సుమారు 40 మంది భక్తులు అమ్మవారి మాలాధారణ చేశారు. తొమ్మిది రోజుల పాటు కఠోర దీక్షలు పాటించి, శనివారం అమ్మవారి ఇరుముడులు ధరించి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన హోమగుండంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఇరుముడులు సమర్పించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కాళ్ల అమృతల్లినాయుడు పర్యవేక్షణలో, ఆలయ ప్రధాన అర్చకులు దంతుకుర్తి శ్రీనివాసశర్మ సారధ్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. 2006 నుంచి ప్రతి ఏటా శ్రావణ మాసంలో అమ్మవారి మాలాధారణ దీక్షలు చెయ్యడం ఆనవాయితీ.

వడ్డాదిలో బస్ షెల్టర్ కూల్చివేత



పొక్లెయిన్‌తో చేస్తున్న పనులను అడ్డుకుంటున్న వీఆర్వో సుధాకర్

బుచ్చెయ్యపేట : మండలంలో గల మేజర్ పంచాయతీ వడ్డాది వేంకటేశ్వరస్వామి ఆర్చ్ ఎదురుగా ఆర్అండ్‌బి రోడ్డు పక్కన ఉన్న బస్ షెల్టర్‌ను గ్రామానికి చెందిన వ్యక్తి తొలగించారు. సుమారు 25 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ బస్ షెల్టర్‌ను తన భూమికి ఎదురుగా ఉందని కూల్చడంపై గ్రామస్తులు ఆగ్రహం చెందుతున్నారు. వందలాది మంది ప్రయాణికుల నీడ కోసం ఏర్పాటు చేసిన బస్ షెల్టర్‌ను కూల్చడంపై పంచాయతీ కార్యదర్శి లవరాజు బుచ్చెయ్యపేట పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. బస్ షెల్టర్‌ను తిరిగి నిర్మించాలని ప్రయాణికులకు వసతి కల్పించాలని, గ్రామ పంచాయతీ స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా అధికారులు చూడాలని గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దొండా నారాయణమూర్తి , వార్డు మెంబరు వరహాలబాబు కోరారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా రెల్లి కులస్తుల ఆందోళన



ఏఎల్‌పురంలో ఆందోళన చేస్తున్న రెల్లి కులస్తులు

గొలుగొండ: ఎస్సీ వర్గీకరణ వల్ల రెల్లి కులస్తులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని మండలంలో ఏఎల్‌పురంలో రెల్లి కులస్తులు శనివారం ఆందోళన నిర్వహించారు. సుప్రీం కోర్టు తీర్పు వల్ల ఎస్సీ వర్గీకరణ అయితే ప్రధానంగా రెల్లి కులస్తులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని సంఘం సభ్యులు ఆవేదన చెందారు. ఏఎల్‌పురం ప్రధాన రోడ్డుపై ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. సుప్రీం తీర్పును పునఃపరిశీలించాలని కోరారు. కార్యక్రమంలో రెల్లి కులస్తుల సంఘం సభ్యులు అప్పన్నబాబు, సత్యన్నారాయణ, బాబ్జి, శివకుమార్,చినబాబు, శ్రీను పాల్గొన్నారు.

ఆస్పత్రి ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు అవసరం



ప్రభుత్వ ఆస్పత్రి పరిసర ప్రాంగణాలతో పాటు వైద్య సిబ్బంది ఉండే గదుల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. వైద్యం కోసం వచ్చే వారికి మెరుగైన వైద్యం అందించాలన్న తపనతో వైద్యులు ఉంటారు. సంయమనం లేని కొందరు వైద్య సిబ్బందిపై దాడులకు పాల్పడుతున్నారు. ప్రధానంగా మహిళా వైద్యులు ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. సీసీ కెమెరాలతో పాటు పోలీసు సిబ్బంది ప్రతిరోజూ ఆస్పత్రుల వద్ద రాత్రి సమయాల్లో తనిఖీలు జరపడం ముఖ్యం. దీంతో వైద్య సిబ్బందికి భద్రత లభిస్తుంది.

– డాక్టర్ నందకిషోర్, ఆర్థోపెడిక్ వైద్యాధికారి, కె.కోటపాడు గ్రామీణ ఆరోగ్య కేంద్రం

పోలీసు గస్తీ నిర్వహించాలి



రాత్రి వేళల్లో పీహెచ్‌సీ వద్ద పోలీసు గస్తీ చేపట్టాలి. నిత్యం పోలీసు గస్తీ నిర్వహిస్తే వైద్య సిబ్బందికి రక్షణగా ఉంటుంది. అంతే కాకుండా రాత్రి వేళల్లో మద్యం మత్తులో గొడవలు చేసేవాళ్లను నియంత్రించే వీలుంటుంది. సిబ్బంది విశ్రాంతి తీసుకునేందుకు ప్రత్యేకంగా గదులు కూడా ఏర్పాటు చేయాలి. వైద్య సిబ్బందిపై దాడులకు దిగేవారిని కఠినంగా శిక్షించాలి. ఇటీవల గిడుతూరులో ఒక వ్యక్తి మద్యం మత్తులో సబ్ సెంటర్‌లోకి ప్రవేశించి సామాగ్రి ధ్వంసం చేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాం.

– సీతారామలక్ష్మి, వైద్యాధికారి, మాకవరపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



కె.జె.పురం పశువైద్యశాలలో దెబ్బతిన్న గచ్చులు



శ్లాబ్ పూర్తిగా శిథిలమైన జేడీపేట గ్రామీణ పశువైద్యశాల భవనం

శిథిలావస్థకు చేరిన పశువైద్యకేంద్రాలు



శిథిలావస్థకు చేరిన కె.జె.పురం పశువైద్య పర్యవేక్ష కేంద్రం

మండలం పశువైద్య కేంద్రాల సంఖ్య 3
గ్రామీణ పశువైద్య కేంద్రాల సంఖ్య 1
మండలంలో పశు సంపద గొర్రెలు మేకలు, కోళ్ల సంఖ్య
ఆవులు : 10,700, గేదెలు : 9846,
మేకలు : 4461, గొర్రెలు : 8825,
పౌల్ట్రీ (కోళ్లు) : 74,610

- ఇబ్బందులు పడుతున్న రైతులు
- వర్షం వస్తే కారుతున్న శ్లాబ్‌లు
- వానొస్తే ముంపులో కె.జె.పురం, కింతలి వల్లాపురం పశువైద్యశాలలు
- కింతలి వల్లాపురం పశువైద్యాధికారి డిప్యుటేషన్‌పై బదిలీ

మాడుగుల రూరల్ : మాడుగుల మండలంలో గల పశువైద్య పర్యవేక్ష కేంద్రాలు, గ్రామీణ పశువైద్య కేంద్రం శిథిలావస్థకు చేరాయి. దీంతో రైతులు, అటు పశువైద్య సిబ్బంది నానాయాతనలు పడుతున్నారు. శిథిలమైన పశువైద్య కేంద్రాలు శ్లాబ్‌లు పూర్తిగా శిథిలమై వర్షం వస్తే పూర్తిగా కారిపోతున్నాయి. దీంతో ఆస్పత్రిలో గల రికార్డులు, మందులు, దాణా, ఇతర కంప్యూటర్ పరికరాలు తడిసి ముద్దవుతున్నాయి. మండలంలో కె.జె.పురం పశువైద్యశాల 1987లో గ్రామంలో పాలసొసైటీ పక్కన్న నిర్మించారు. భవనం నిర్మించిన ప్రదేశం మంచిది కాకపోవడం వల్ల భవనం ప్రదేశం గచ్చు శిథిలమైంది. సుమారు పదేళ్ల క్రితం భవనానికి మరమ్మతులు చేయించారు. అయినా సరే గచ్చులు పూర్తిగా పెచ్చులుడాయి. దీనికి తోడు శ్లాబ్ పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఏ మాత్రం వర్షం వచ్చినా భవనం పూర్తిగా కారిపోతుంది. వైద్యాధికారి గది, మందుల స్టాక్ రూమ్ పూర్తిగా కారిపోతుంది. మందులు, పశుగ్రాస విత్తనాలు తడిసి పోతున్నాయి. ఆస్పత్రి ఆవరణ అంతా తుప్పలతో నిండి ఉంది.

కూలడానికి సిద్ధంగా..

జేడీపేటలో గ్రామీణ పశువైద్య కేంద్రం 1969లో ఏర్పాటు చేశారు. 1997లో అప్పటి ఎమ్మెల్యే రెడ్డి సత్యనారాయణ హయాంలో రూ.60 వేల వ్యయంతో చిన్న గదిని నిర్మించారు. పిడుగు పడితే భవనం శ్లాబ్ పెచ్చులు పడి కింద వున్న వారి నెత్తి మీద పడి ప్రమాదాలకు రైతులు, సిబ్బంది గురవుతున్నారు. వర్షం కురిస్తే నీరు వారం రోజులపాటు కిందికి చిమ్ముతుండడంతో రికార్డులు, మందులు, విత్తనాలు తడిసి ముద్దవుతున్నాయి. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వెటర్నరీ లైవ్‌స్టాక్ అధికారి సిహెచ్. సత్యం అటు ఇటు కుర్చీలు, టేబుళ్లు మార్చుకుని అవస్థలు పడుతున్నారు. గతంలో పలువురు రైతులు ఈ భవనం మరమ్మతులు చేపట్టాలని గత పాలకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ భవనం స్థానంలో కొత్త భవనం నిర్మాణానికి నిధులు మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించారు. అయినా సరే కార్యరూపం దాల్చలేదని రైతులు దుద్దు రాంబాబు, మడక భాస్కరావు, రామునాయుడు, జగ్గునాయుడు తెలిపారు. కింతలి వల్లాపురం పశువైద్య కేంద్రం 6 పంచాయతీలకు పశువైద్యం అందిస్తుంది. ఈ భవనం కిటికీలు, తలుపులు పూర్తిగా పోయాయి. వర్షం వస్తే ఆస్పత్రి అంతా పూర్తి నీటి ముంపునకు గురవుతుంది. ఇక్కడ వైద్యాధికారి డిప్యూటేషన్ మీద ఇటీవల నాతవరం మండలం బదిలీపై వెళ్లారు. ఇక్కడ వెటర్నరీ సహాయకులు, ఓఎస్‌డీ విధులు నిర్వహిస్తున్నారు.

పక్కా భవనం నిర్మించాలి



జేడీపేట గ్రామీణ పశువైద్య కేంద్రం భవనం శిథిలావస్థకు చేరింది. కనీసం సిబ్బంది విధులు నిర్వహించడానికి కూడా ఇక్కడ ఇబ్బందిగా ఉంది. మందులు, రికార్డులు, పశుగ్రాస విత్తనాలు తడిసిపోతున్నాయి. వర్షపు నీరు శ్లాబ్ మీద నుంచి కిందికి పారుతుంది. ఈ భవనం స్థానంలో కొత్త భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి. పూర్తి స్థాయిలో పక్కా భవనం నిర్మించాలి

– మట్టా ఈశ్వరావు, రైతు, పాలసొసైటీ మాజీ అధ్యక్షుడు, జె.డి.పేట

శ్లాబ్ శిథిలమైంది..



కె.జె.పురం పశువైద్య పర్యవేక్షక కేంద్రం భవనం శ్లాబ్ పూర్తిగా శిథిలమైంది. వర్షం వస్తే భవనం మొత్తం కారిపోతుంది. కంప్యూటర్ తదితర వస్తువులు ఒక గదిలో వుంచుతున్నారు. భవనానికి మరమ్మతులు చేపట్టాలి. ఆస్పత్రి ఆవరణలో నీరు చేరకుండా మట్టితో ఎత్తు చేయించాలి.

– కె.వెంకటప్పారావు, రైతు, కె.జె.పురం

ప్రతిపాదనలు పంపించాం



మండలంలో గల జె.డి.పేట గ్రామీణ పశువైద్య కేంద్ర భవనం నిర్మాణానికి నిధుల మంజూరు కోసం ఎప్పటికప్పుడు ప్రతిపాదనలు పంపిస్తున్నాం. కె.జె.పురం, కె.వల్లాపురం ఆస్పత్రి భవనాల మరమ్మతుల కోసం సంబంధిత ఎంపీటీసీ సభ్యుల అనుమతితో నిధుల కోసం ప్రతిపాదనలు పంపించారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉండడం వల్ల కార్యాచరణలోకి రాలేదు. ప్రత్యేకంగా ఆస్పత్రి భవనాల మరమ్మతులు, కొత్త భవనాల నిర్మాణాలకు ఎటువంటి బడ్జెట్ లేదు. జేడీపేట భవనానికి గతంలో రూ.15 లక్షలతో ఆర్.కె.వై నిధులు మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించాం.

– వి.చిట్టినాయుడు, ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకుడు, మాడుగుల

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

దేవరాపల్లి : దేవరాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న మూడు అధ్యాపకుల పోస్టులను అతిథి అధ్యాపకులతో భర్తీ ప్రక్రియ చేడుతున్నామని స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ బి. రాధ తెలిపారు. జువాలజీ, ఒకేషనల్ కోర్సులలో కంప్యూటర్ సైన్స్, జీఎఫ్‌సీ పోస్టులను గెస్ట్ లెక్చరర్లతో భర్తీ చేస్తున్నామని, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 28న స్థానిక కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆమె కోరారు. జువాలజీ పోస్టుకు దరఖాస్తులు చేసే వారు ఎంఎస్సీ జువాలజీలో యాభై శాతం మార్కులతోను, కంప్యూటర్ సైన్స్‌కు పోస్టుకు బీటెక్ కంప్యూటర్స్‌లో యాభై శాతం మార్కులతోను, జీఎఫ్‌సీ పోస్టుకు ఎంఏ ఎకనామిక్స్(రూరల్ డెవలప్‌మెంట్)లో యాభై మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఇంటర్వ్యూలలో ఎంపికయ్యే అధ్యాపకులకు నెలకు రూ.10 వేలు చొప్పున గౌరవ వేతనం చెల్లిస్తామని స్థానిక ప్రిన్సిపాల్ బి.రాధ తెలిపారు.

అడ్డసరంలో పొలంబడి కార్యక్రమం



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శ్రీదేవి

రోలుగుంట : మండలంలోని అడ్డసరం గ్రామంలో మండల వ్యవసాయశాఖ అధ్వర్యంలో శనివారం మండల వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇక్కడ పాల్గొన్న ఆ శాఖ ఏడీఏ శ్రీదేవి మేలైన వ్యవసాయ పద్ధతుల గురించి వివరించారు. రైతులను ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్‌లో సభ్యులుగా చేర్పించడం, పండిన పంట సర్టిఫికేషన్ చేయడం, సర్టిఫికేషన్ అయిన పంటను ఆన్‌లైన్ ద్వారా విక్రయించడం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో ద్రవ జీవామృతం తయారీ, వినియోగం, ఉపయోగాలను వివరించారు.

సెప్టెంబర్ 14న జాతీయ లోక్‌అదాలత్



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షీయాజ్ ఖాన్

నర్సీపట్నం: సెప్టెంబర్ 14న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షీయాజ్ ఖాన్ పేర్కొన్నారు. కోర్టు సముదాయంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వివిధ పోలీసు స్టేషన్ల సీఐలు, ఎస్ఐలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ రాజీ పడదగిన సివిల్, క్రిమినల్ కేసులను ఇరువర్గాల అంగీకారంతో సత్వరమే పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ విషయాన్ని కక్షిదారుల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకోవడం ద్వారా ఇరువర్గాలకు మేలు చేకూరుతుందన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించుకుంటే అప్పీల్‌కు వెళ్లే అవకాశం ఉండదన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా చైతన్యం తీసుకురావాలని పోలీసు అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి మధుసూధన్‌రావు, అదనపు సివిల్ జడ్జి రోహిత్ మాట్లాడారు.

వరి నాట్లకు అనుకూలంగా వర్షాలు



ముకుందపురంలో వేసిన వరినాట్లు

రోలుగుంట: మండలంలో పలు గ్రామాల్లో శనివారం కురిసిన వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో గల పల్లపు భూములు గల, శరభవరం, పడాలపాలెం, లగుడు కొత్తూరు తదితర గ్రామాల్లో వరినాట్లు పూర్తయ్యాయి. జేపీ అగ్రహారం , వడ్డిప, కొంతలం తదితర గ్రామాల్లో వరి ఆకు గల భూముల్లో నాట్లకు అనుకూల తడులు లేక సాగునీటి వసతి లేక నాట్లు వేయలేదు. శనివారం వేకువ జామున చిరు జల్లులు, అలాగే 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ ఒక మోస్తరు వర్షం పడి భూముల్లో నీరు చేరింది. ఖరీఫ్‌లో 1337 హెక్టార్ల విస్తీర్ణంలో వరి నాట్లు పడాల్సి ఉండగా, ఇప్పటికి 1175 హెక్టార్లలో నాట్లు వేశారు. ఈ వారంలో కురిసిన వర్షాలకు మిగిలిన భూముల్లో నాట్లు పడే అవకాశం ఉందని వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి తెలిపారు.

మాడుగుల రూరల్: ఈ నెల 18 వ తేదీ నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో పల్లపు, మెట్ట భూముల్లో వరినాట్లు వేస్తున్నారు. అడపా దడపా కురుస్తున్న మోస్తరు వర్షాలతో నాట్లు ఊపందుకున్నాయి. తారకరామ, పొలగెడ్డ, పెద్దేరు, ఉరకగెడ్డ, జలాశయాల్లో నీరు పుష్కలంగా చేరడంతో వరినాట్లు వేసే పనిలో రైతులు నిమగ్నులై ఉన్నారు. మండలంలో 10,500 ఎకరాలు భూమి లో వరినాట్లు పడాల్సి వుండగా, ఇంత వరకు 6,200 ఎకరాల్లో మాత్రం నాట్లు వేశారని మండల వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు శనివారం తెలిపారు.

మాడుగుల: మండలంలో ఖరీఫ్ వరి సాధారణ విస్తీర్ణం 10,500 ఎకరాలు కాగా ఈ ఏడాది 10 వేల ఎకరాల్లో మాత్రమే వరి సాగు చేశారు. వర్షాలు అనుకూలించకపోవడంతో మెట్ట భూముల్లో అడపాదడపా కురుస్తున్న వర్షాలకు ఇంకా వరి నాట్లు వేస్తూనే ఉన్నారు.

రేషన్ డిపో గుమస్తా కుటుంబానికి బాసట



ఆచారి కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న రేషన్ డీలర్ల యూనియన్ ప్రతినిధులు

దేవరాపల్లి: మండలంలోని గరిశింగి రేషన్ డిపోలో 20 ఏళ్ల పాటు పనిచేసిన చేబ్రోలు వీరభద్ర ఆచారి ఇటీవల మృతి చెందారు. కాగా బాధిత కుటుంబానికి దేవరాపల్లి రేషన్ డీలర్ల అసోసియేషన్ బాసటగా నిలిచింది. ఈ మేరకు బాధిత కుటుంబానికి రూ. 10,200 నగదును శనివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేసి అండగా నిలిచారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు రేషన్ డీలర్ల అసోసియేషన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వెత్సా రమేష్, చిటికిరెడ్డి స్వామినాయుడు, పసుమర్తి విశ్వేశ్వరరావు, వెత్సా రాజేష్, మిడతాడ శ్రీను పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

మాకవరపాలెం: మృతుడి కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. మండలంలోని బూరుగుపాలెం గ్రామానికి చెందిన వబ్బలరెడ్డి చిన్ని స్థానికంగా ఉన్న హనుమాన్ సేవా సంఘంలో సభ్యుడుగా ఉన్నాడు. ఈయన మృతి చెందడంతో సంఘంలో ఉన్న ఇతర సభ్యులు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



తూటిపాలలో కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు

మాకవరపాలెం: తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, విద్యార్థినులు కృష్ణుడు, గోపికల వేషధారణలో వేడుకల్లో పాల్గొన్నారు. ఉట్టిని కొట్టి నృత్యాలు చేశారు. పాఠశాల హెచ్ఎం కె.రాము మాట్లాడుతూ తెలుగు పండగలను విద్యార్థులకు తెలియజెప్పాలనే ఉద్దేశ్యంతో ఈ వేడుకలు నిర్వహించామన్నారు. ఉపాధ్యాయులు లోవరాజు, సంతోషి, నారాయణరావు పాల్గొన్నారు.

చిన్నారి కృష్ణులు, గోపెమ్మల సందడి

కె.కోటపాడు: కె.కోటపాడు అయ్యన్న పాఠశాలలో శనివారం పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. విద్యార్థులు శ్రీకృష్ణ, సత్యభామ, గోపికల వేషధారణల్లో అలరించారు. ఉట్టికొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

దేవరాపల్లి: మండల కేంద్రంలో కృష్ణాష్టమి వేడుకలు శనివారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలలో భాగంగా తొలి రోజు శనివారం స్వామి వారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. రెండో రోజు ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఆఖరి రోజు సోమవారం కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలతో పాటు మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్న సమారాధనను నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం ఆలయ ఆవరణలో పిడతల పోటీ, ఉట్టి మహోత్సవం, స్వామి వారి ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు.



కృష్ణాష్టమి వేడుకల్లో కృష్ణులు, గోపికల సందడి

నర్సీపట్నం : స్థానిక శారదనగర్‌లోని శ్రీదుర్గా శాంతినికేతన్ కిడ్స్ క్యాంపస్‌లో కృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ విగ్రహానికి పూజలు చేశారు. గోవర్ధనగిరి కృష్ణ, యశోదకృష్ణ, గోపాలకృష్ణ, వెన్నదొంగ కృష్ణ, గోపికాకృష్ణ వేషధారణల్లో చిన్నారులు అలరించారు. వేదికపై చిన్నారులు ప్రదర్శించిన రాధా కృష్ణుల నృత్యం అందరినీ అలరించింది. ఉట్టికొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కిడ్స్ క్యాంపస్ కరస్పాండెంట్ జె.శిరీషారాణి శ్రీకృష్ణ అవతార విశేషాలను విద్యార్థులకు వివరించారు.

రాయితీలు సద్వినియోగం చేసుకోవాలి



టీకా కార్యక్రమం పర్యవేక్షిస్తున్న ఏడీ చిట్టినాయుడు

మాడుగుల: పశువైద్య శాఖ ద్వారా అందిస్తున్న రాయితీలు పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏడీ చిట్టినాయుడు సూచించారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఉచిత గాలి కుంటు వ్యాధి, బ్రూసెల్లో టీకాలు కార్యక్రమాన్ని గొటివాడ అగ్రహారంలో ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న లింగ నిర్ధారిత వీర్యం, పశుబీమా పథకం, గురించి అవగాహన కల్పించారు. ఈ నెల 20 వ తేదీ నుంచి మండలంలో 2488 పశువులకు గాలికుంటు వ్యాధులకు, 160 పెయ్యిలకు బ్రూసెల్లోసెస్, వ్యాధి నివారణ టీకాలు వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కేజేపురం పశువైద్యాధికారి, మణిలక్ష్మణ్, పశు వైద్యసిబ్బంది మోదినాయుడు పాల్గొన్నారు.

గురుకులంలో మిగులు సీట్లకు దరఖాస్తులు

దేవరాపల్లి : తెనుగుపూడి డా. బీఆర్.అంబేద్కర్ గురుకుల విద్యాలయంలో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ సీట్లలో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక ప్రిన్సిపాల్ డి.జయప్రకాష్ తెలిపారు. 5వ తరగతిలో 10 సీట్లు, 8వ తరగతిలో 13 సీట్లు, 9వ తరగతిలో 5 సీట్లు, ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో 10 సీట్లు, ఫస్టియర్ బైపీసీలో 10 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. సీట్లు కావాల్సిన వారు ఈ నెల 31లోగా విద్యాలయం పని చేసే వేళల్లో దరఖాస్తుతో పాటు విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్‌కార్డులతో నేరుగా తమ కార్యాలయాన్ని సంప్రదించాలని ప్రిన్సిపాల్ డి.జయప్రకాష్ కోరారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాల అమల్లో వివక్ష తగదు

సర్వ సభ్య సమావేశంలో ఎంపీపీ లక్ష్మణమూర్తి



మాట్లాడుతున్న ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి

నాతవరం: సభలో ప్రజాప్రతినిధులు అడిగిన పనులను గ్రామాల్లో వివక్ష లేకుండా అధికారులు అమలు చేయాలని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అన్నారు. మండల సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. గత సమావేశంలో సభ్యులు చర్చించిన అంశాలను ఎంత వరకు నెరవేర్చారో ఎంపీడీవో హనుమంతరావు సభలో వివరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిందని అధికారులు క్షేత్ర స్థాయిలో అభివృద్ధి , సంక్షేమ పథకాల అమలు విషయంలో ఎలాంటి వివక్ష చూపరాదన్నారు. ప్రభుత్వ నిబంధనలు అనుసరించి స్థానిక సభ్యులను సమన్వయం చేసుకుని అధికారులు పనిచేయాలన్నారు. పెదగొలుగొండపేట సచివాలయంలో ఎరువులు రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ మిరపల వెంకటరమణ తెలిపారు. మిగతా గ్రామాలకు వచ్చి మా వద్దకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. వ్యవసాయాధికారి శైలజ మాట్లాడుతూ అక్కడ పని చేసే సచివాలయ సిబ్బందిపై జేడీకి ఫిర్యాదు చేశాని, రైతులకు ఇబ్బంది లేకుండా చేస్తానన్నారు. వల్సంపేట గ్రామంలో పంచాయతీ జనరల్ ఫండ్‌తో పనులు చేసేందుకు పీఆర్ జేఈ వెంకటేశ్వరమ్మ అందుబాటులో లేక ఇబ్బంది పడుతున్నామని సర్పంచ్ శ్రీను తెలిపారు. వచ్చే నెలలో పనులు ప్రారంభించి పూర్తి చేస్తామని జేఈ సమాధానం ఇచ్చారు. సభ్యులు అడిగిన ప్రశ్నలపై ఎంపీడీవో మాట్లాడుతూ నిబంధనల ప్రకారం దశలవారీగా పనులు పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, జేఈలు జోగారావు, వెంకటేశ్వరమ్మ, రాజేష్, గొలుగొండ ఐసీడీఎస్ సీడీపీవో శ్రీగౌరి తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా ప్రమాదంపై ఉన్నతస్థాయి దర్యాప్తు చేయాలి



కొత్తూరు జంక్షన్ వద్ద నిరసన తెలుపుతున్న స్త్రీ విముక్తి సంస్థ ప్రతినిధులు

చోడవరం /చోడవరం రూరల్ : అచ్యుతాపురం వద్ద ఎసెన్షియా ఫార్మా కంపెనీలో ప్రమాదంపై ఉన్నత స్థాయి కమిటీతో విచారణ చేయించాలని ఆంధ్రప్రదేశ్ దళిత స్త్రీ విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ డిమాండ్ చేశారు. దళిత స్త్రీ విముక్తి ఆధ్వర్యంలో చోడవరంలో శనివారం ఆందోళన చేశారు. ఫార్మా కంపెనీల్లో తరుచూ ప్రమాదాలు జరిగి అనేక మంది మృతిచెందుతున్నా ప్రభుత్వాలు మాత్రం ఏమీ పట్టించుకోలేదని విమర్శించారు.

మెరక ప్రాంతాల్లో వర్షంతో మేలు

బుచ్చెయ్యపేట : మండలంలో శనివారం కురిసిన వర్షం మెరక ప్రాంత రైతులకు మేలు చేసింది. ఉదయం నుండి రాత్రి వరకు కురిసిన వర్షంతో మెట్ట ప్రాంత పొలాల్లో వర్షం నీరు చేరింది. జోరు వానతో వాహనదార్లు,రాకపోకలు సాగించే ప్రయాణికులు అవస్థలు పడ్డారు. రోడ్లపై వర్షం నీరు చేరింది. పంట పొలాల్లో నీరు చేరడంతో బుచ్చెయ్యపేట, మల్లాం, రాజాం, దిబ్బిడి, శింగవరం, తురకలపూడి, పెదమదీన, సీతయ్యపేట, గున్నెంపూడి, కేపీ అగ్రహారం, కొండపాలెం తదితర గ్రామాల్లో రైతులు పంట దమ్ములు చేసి వరి నాట్లు వేస్తున్నారు.